# శిక్ష ఎవరికి?

అది ఒక కోర్టుహాలు. ఆ రోజు నగరంలో గత కొద్ది రోజులుగా సంచలనం కలిగించిన ఒక కేసుకు తీర్పు ఇవ్వబోతున్నారు జడ్జిగారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చారు ముఖ్యంగా స్త్రీలు ఎక్కువ మంది ఉన్నారు.

ఎందుకంటే ఆ కేసు స్త్రీలకు సంబంధించినది కాబట్టి.

జడ్జిగారు వస్తున్నట్లుంది. కొద్దిగా అలజడి రేగింది, కోర్టు హాలులో బోనులో తల మీదుగా ముసుగు వేసుకున్న ఒక స్త్రీని హాజరు పరిచారు- ప్రేక్షకుల గ్యాలరినుండి ఒకటే సంభాషణలు, గుసగుసలు ఎక్కువయినయ్.

'ఉః । సైలెన్స్ ' అన్నారు జడ్జిగారు.

" గత వారం రోజులుగా జరుగుతున్న ఈ శిశువు దొంగతనం కేసులో ప్రాసిక్యూషన్ వారి కథనం, దోషి వెలిబుచ్చిన అభిప్రాయాలు సాక్ష్యాధారాలను బట్టి శ్రీమతి భవాని, శ్రీశివకుమార్ దంపతుల గారాల బిడ్డ చి॥ గిరిజను తన స్వంతం చేసుకోవాలనే దురుద్దేశ్యంతో బిడ్డను

దొంగిలించి పారిపోయినందుకుగాను ఐ. పి. సి. 365 సెక్షను ప్రకారం ఆరు సంవత్సరాలు కఠిన కారాగారవాసశిక్ష విధించడమైనది.

ఈ హిందూ సమాజంలో తను ఒక స్త్రీ మూర్తిగా బ్రతుకుతూ, గౌరవనీయమైన స్త్రీలోకానికి అపకీర్తి తెచ్చిన శ్రీమతి భవానిని మహిళ అనే ఉద్దేశ్యంతో విడిచి పుచ్చాలని విఫల ప్రయత్నం చేశాను.

ఆమె చేసిన నేరం సహించరానిది. మరొక స్త్రీమూర్తికి కడుపు శోకం కలిగించటానికి ప్రయత్నించిన ఆమెకు ఈ లోకంలో ఈ కోర్టు విధించిన శిక్ష చాలా చిన్నది. మరో లోకంలో ఆమె చాలా మూల్యం చెల్లించాల్సి వస్తుంది. " అని జడ్జిగారు తీర్పు ఇచ్చి లేవబోతుండగా—

బోనులో ఉన్న స్త్రీ ముసుగు తొలగించుకుని " జడ్జిగారూ! నేను నాకు విధించిన శిక్షను సంతోషంతో స్వీకరిస్తున్నాను. నేను ఈ నేరాన్ని ఎటువంటి పరిస్థితుల్లో చేశానో ఈ లోకానికి చెప్పటానికి నాకు ఈ చివరి అవకాశం ఇప్పించమని కోర్టు వారిని కోరుతున్నాను. దయచేసి నాకు ఈ అవకాశం ఇవ్వండి." ఆమె ఆక్రోశించ సాగింది.

" అమ్మా మీరు చెప్పదలచుకున్నది క్లుప్తంగా చెప్పండి."

" మాది మధ్యతరగతి కుటుంబం. మా వారు ఏదో చిన్న ఉద్యోగం. దేనికీ లోటులేని సంపాదన మా వారిది. మాకు వివాహం అయి పది సంవత్సరాలయింది. మా దురదృష్టం కొద్దీ సంతానం కలుగలేదు ఎన్నో ప్రయత్నాలు, ఎంతమందో డాక్టర్లు, ఎన్నో మందులు, ఎన్నో తీర్థయాత్రలు, మ్రొక్కని దేముళ్ళు లేరు. కాని ఫలితం శూన్యం.

ఇలా ఉండగా మాకు ఈ ఊరు బదిలీ అయ్యింది. మేము అద్దెకు తీసుకున్న పోర్షనుకు ఎదురుగా ముచ్చటైన దంపతులు దిగేరు. వారికి ఒక ముద్దులు మూటగట్టే పాప. భార్యా భర్త లిద్దరికీ ఉద్యోగం. ఆ పాపని పని అమ్మాయి చూస్తూండేది.

ఒక రోజు వారింటికి వెళ్ళాను.

" ఏమండీ "

" ఎవరు మీరు ? "

నేను ఎదురింట్లో ఉంటున్నానండి. దయచేసి మీరు ఏమీ అనుకోకపోతే ఒక్క కోరిక " అన్నాను.

" ఏమిటి చెప్పండి నేను తీర్చగలిగేది అయితే తీరుస్తాను " అన్నదామె.

" మీరు ఇద్దరూ ఆఫీసుకు వెళ్తున్నారు కదా. పాపను పని అమ్మాయికి అప్ప చెపుతున్నారుకదా : మీరు పని అమ్మాయిని మానిపించెయ్యండి నేను మీ పాపను మీరు లేని సమయంలో చూసుకుంటాను. అంతే. అంతకంటే మరేంలేదు."

" భలే వారేనే, దాని సంగతి మీ కెందుకులెండి. అది భలే అల్లరి చేస్తుంది. మిమ్మల్ని కూర్చోనివ్వదు నుంచోనివ్వదు. సరదాగా ఉంటే అప్పుడప్పుడు మా పని అమ్మాయిని తీసుకురమ్మంటే మీ ఇంటికి తీసుకు వస్తుంది. దానితో కాలక్షేపం చెయ్యండి ఏం ? " అన్నదామె.

కె. బి. కృష్ణ

" నాకు వివాహం అయి పది సంవత్సరాలు అయింది. ఇంతవరకు భగవంతుడు మాకు దయ చూపించలేదు. నాకు పిల్లలంటే అమితమైన ప్రేమ. నా ఆశతీరే రోజులు దరిదాపుల్లో లేవని నేను తెలుసుకున్నాను. ఈ జన్మకు ఆ భాగ్యం లేదేమో! అందుకని మీ పాపతో ఆడుకుని. ఈ విషాదం నుండి కొద్దిగంటలు తేరుకుందామని నా ఆశ. నన్ను [illegible] చేసుకోవద్దమ్మా " అన్నాను నేను.

ఆమె నన్ను నిశితంగా చూసి " సరే పని పిల్లను మాన్పించడమెందుకులెండి. మా ఇంటి దగ్గర ఉంటుంది. మీకు కావల్సినపుడు పిలవండి. పాపను మీ ఇంటి దగ్గర ఉంచుకోండి" అన్నదామె.

ఈలోగా పాపను ఎత్తుకుని పనిపిల్ల వచ్చింది. " పాపా" అన్నాను. చిఱునవ్వులు ఒలకబోస్తూ నాచేతుల్లో వాలింది. " గిరీ ! ఆంటీ దగ్గర ఉంటావా. నేను ఆఫీసుకు వెళ్ళి వచ్చే వరకూ" పాప పేరు గిరిజ. ఆమె లీలాకుమారి.

ఆ రోజునుండి పాప నాకు మాలిమి అయ్యింది. పాప అమృత హస్తాలతో నావ్యథిత హృదయం శాంతించింది. నాకు పిల్లలు లేరు అన్న బాధనుండి నేను క్రమేపి దూరమవసాగేను.

ఒక రోజు నేను పాపను ఆడిస్తూంటే మా వారు ఆఫీసు నుండి అనుకోకుండా ముందుగా వచ్చారు. నేను ఈ పాపను లీలగారు ఆఫీసుకు వెళ్ళినప్పుడు ఆడిస్తున్న సంగతి ఆయనకు నేను చెప్పక పోయినా గ్రహించారు.

" డియర్ "

" ఏమిటండి ? "

" సాయంకాలం సినిమాకు వెళ్దాం రెడీగా ఉండు. మంచి సినిమా వెళ్ళిపోతుంది " అన్నారాయన.

" పాపను వాళ్ళమ్మకు అప్పచెప్పాలి కదండి! నేను రాను లెండి. మీరు వెళ్ళండి " అన్నాను నేను.

"భవానీ! మన జీవితంలో మనం కోరుకున్నవి మనకు రావని తెలుసుకున్నాం కదా అలాంటప్పుడు ఎరువు తెచ్చుకున్న బంధాలతో ఎన్నిరోజులు నీ మాతృత్వపు ఆకలిని తీర్చుకుంటావు ? ఒకవేళ వాళ్ళు బదిలీ అయి వెళ్ళిపోతే ఏంచేస్తావ్? " అని సూటిగా ప్రశ్నించారు నన్ను.

" అమ్మో! బదిలీ అయి వెళ్ళిపోవడమే! నేను పాప లేకుండా ఉండలేను ఎలాగ ? " నా హృదయం ఆర్ద్రమైంది. మాట మాత్రం సహించలేక పోతున్నానే, నిజంగా ఇలా జరిగితే ఎలాగు ? మనసంతా వికలమై పోయింది.

ఆ రోజు సాయంత్రం లీలాకుమారిగారు సంతోషంతో నా దగ్గరకు వచ్చి " మా స్వంత ఊరికి బదిలీ అయిందండి. ఎన్నో రోజులనుండి ప్రయత్నిస్తుంటే ఇన్నాళ్ళకు పని జరిగింది. మీరు, మాకు చాలా సహాయం చేశారు. " అన్నది.

కె. బి. కృష్ణ

నా తలమీద ఎవరో మోదినట్లు, నా గుండెలు చేత్తో పట్టుకుని రక్తమంతా పిండివేస్తున్నట్లు,నా నవ నాడులు కృంగి పోయాయి. నుంచో లేకపోయాను స్థాణువునై కుర్చీల్లో కూలబడ్డాను.

" ఏమైంది మీరు ఎందుకలా అయిపోయారు? పాపను తరచు తీసుకు వచ్చి చూపిస్తానులెండి, బాధపడకండి " అంటూ నన్ను సముదాయిస్తూంది. కొద్దిసేపటికి పాపను తీసుకుని ఆమె వెళ్ళిపోయింది.

పాపతో నా సన్నిహిత సంబంధం నా మాతృత్వపు దాహం పాప ద్వారా తీర్చుకుంటున్న ఈ తరుణంలో ఏమిటీ పరీక్ష భగవాన్ ?

పాపను నా దగ్గర వదిలి లీలాకుమారి ఆఫీసుకు వెళ్ళింది. పాప నిదుర పోయింది.

పాపతో గడిపిన మధుర క్షణాలు.

పాపకు ఆకలివేస్తే నా పైటకొంగులాగటం, నేను నవ్వుకుంటూ జీవంలేని నా స్థనాలు పాపనోట్లో పెట్టడం, పాప చీకుతూ నిదురపోవటం—

పాప నిదురపోతూ నా శరీరాన్ని ముఖాన్ని ఆప్యాయతతో తడుముకుంటూ ఉండటం—

పాపకు నీళ్ళు పోస్తుంటే నా మీద నీళ్ళు చల్లి "మమ్మీ" అని అరుస్తుంటే నా హృదయం ఉప్పొంగి " నేను అమ్మను కాలేనమ్మా. నా తీరని కోరికను నీలో చూసుకుంటున్నానమ్మా " అని మనస్సులో వేదనతో అలమటించటం—

పాపకు ఏదైనా పెడితే తను సగం తిని మిగతాది నా వోట్లో కుక్కుతూ నవ్వటం—

లీల ఆఫీసుకు వెళ్తుంటే, సంతోషంతో నా మీదకు గెంతటం—

అమ్మో పాపను వదలి నేను ఉండలేను అయితే దీనికి పరిష్కారం ఏమిటి ? నాకు పిల్లలుపుట్టే యోగంలేదు ఎలాగు ? అప్పుడే నా మనస్సులో ఒక దురాలోచన పుట్టింది.

ఈ పాపను తీసుకుని ఎక్కడికైనా వెళ్ళిపోతే! లీల దంపతులు యవ్వనంలో ఉన్నారు కాబట్టి, వాళ్ళకు ఇంకా సంతానం కలుగుతారు కాబట్టి ఈ పాప నా స్వంతం అయిపోతుంది. ఇంతకన్నా గత్యంతరం కనపడలేదు నాకు.

మరునాడు మామూలుగా లీల ఆఫీసుకి వెళ్ళేటప్పుడు పాపను నాకు అప్పజెప్పి వెళ్ళింది. నేను మా ఇంటికి వెళ్తున్నానని మా వారికి చెప్పి పాపతో బయలుదేరి వెళ్ళాను. తరువాత సంగతి మీకు తెలుసు.

అయితే జడ్జిగారూ ఒక్క సంగతి చెప్పండి శివకుమార్ దంపతుల పాపను నేను తీసుకు వెళ్ళటం పాపమే. కాని మాతృత్వానికి శాశ్వతంగా దూరమైన నాకు, వారి పాపను కొద్ది సమయం చూడటాన్కి అనుమతి ఇచ్చి ఈ తల్లి శోకాన్ని ఎందుకు తీర్చలేక పోయారు ? వారు యవ్వనంలో ఉన్నారు కదా ? వారికి భవిష్యత్తులో చాలామంది పిల్లలు పుడతారు కదా నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదు. కాబట్టి, మీ పాపను నాకు శాశ్వతంగా ఇచ్చేయండి అని అడిగితే వారు నా కోరికను మన్నించక పోవచ్చు మరి ఎలాగు ? అందుకని ఈ విచిత్రమైన దొంగతనం జరిగింది.

కె. బి. కృష్ణ

ఇక్కడ ఉన్న పూజనీయులందరికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ బోనులో ఎందరో డబ్బు దొంగిలించినవారు, నగలు దొంగిలించిన వారు, హత్యలు, దొమ్మీలు చేసినవారు శిక్షలు అనుభవించి ఉంటారు. కాని నేను మాతృత్వానికి అనర్హురాలినై ఒక పసికందును దొంగిలించి విచిత్రమైన దొంగతనంచేసి మీ ముందు ఇలా నిలబడ్డాను. ఎందుకు ?

ఎఱ్ఱగులాబీల్లాంటి చిన్నారి చేతులను తాకాలని, ముద్దులు పెట్టుకోవాలని, ఆ చిన్నారిచేతులు చిలిపిపనులు చేస్తుంటే ఆనందించాలని, ఆ ముద్దుల మూటగట్టే కాళ్ళతో హృదయంపై తన్నుతుంటే తన్మయత్వం పొందాలని, అప్యాయంతో పాపను హృదయానికి, హత్తుకుని నిదుర పోవాలని కల్మషం తెలియని చిఋనవ్వుల్లో మునిగి తేలాలని నేను కన్న కలలు ఎలా తీరుతాయి? నా కలలు నిజం అయ్యేదెప్పుడు? అందుకు పరిష్కారం నేను కనుక్కున్నాను. అందుకని మాతృమూర్తిగా కడుపు తీపి తెలియని నేను మరో మాతృమూర్తికి కడుపు శోకం కలిగించటానికి ప్రయత్నం చేశాను. నా దురాశను మన్నించండి. దురాశ దుఃఖఃచేటు అని మరోసారి ఋజువయింది.

చివరి మాటగా అర్థిస్తున్నాను. శివకుమార్ దంపతుల్లాంటి యువ దంపతులు తమకు ఎక్కువయిన సంతానాన్ని నాలాంటి సంతానంలేని వ్యధిత హృదయులకు పెంచుకోడానికి ఇస్తే వారి జన్మ ధన్యమవుతుందని

భవిష్యత్తులో ఇటువంటివి జరగటానికి అవకాశం ఉండదనీ, సూచించటానికి అనర్హురాలినై, సూచిస్తున్నాను. అయ్యా నన్ను అందరూ మన్నించండి.

శివకుమార్‌గారూ, లీలాకుమారిగారూ, పాపా నా దగ్గరకు ఒకసారి రా తల్లీ. రగిలి పోయే ఈ హృదయాన్ని నీ చల్లని చేతులతో సముదాయించు తల్లీ." అంటూ బోనులో ముద్దాయి కుప్పగా కూలి పోయింది. శివకుమార్ దంపతులు, ముద్దాయి భర్త బోను దగ్గరకు చేరేరు. డాక్టరు వచ్చేరు. ఆమె చనిపోయిందని నిర్ధారించారు. అయితే శిక్ష ఎవరికి — ? కోర్టు ముగిసింది అనాడు.

("జనసుధ" మాసపత్రిక, నవంబర్ 1980)